# బస్సులేవి..?

## 'మహాలక్ష్మి' ఎఫెక్ట్.. తగ్గిన బస్సులు

### ప్రయాణికుల తిప్పలు

### సమయానికి నడపని అధికారులు

- ఆర్టీసీ బస్సుల్లో పెరిగిన రద్దీ
- ప్రయాణికుల అగచాట్లు
- ప్రయాణికుల రద్దీకి సరిపడా బస్సులు పెంచాలని వినతి





శుక్రవారం సిద్దిపేట మోడ్రన్ బస్టాండ్‌లో బస్సులు ఎక్కేందుకు ప్రయాణికుల ఇక్కట్లు

దుబ్బాక, జనవరి 19: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం.. ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. అరకొర బస్సులు, వచ్చిన బస్సుల్లో ప్రయాణికుల రద్దీతో సమస్యగా మారింది. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు భారీ సంఖ్యలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. దీంతో విద్యార్థులు, ఉద్యోగులతో పాటు మగవారికి మరింత సమస్యగా మారింది.

### దుబ్బాక బస్‌డిపోలో..

దుబ్బాక బస్‌డిపోలో 34 బస్సులు ఉన్నాయి. ఇందులో 8 అద్దె బస్సులు ఉండగా, 12 రూట్లలో బస్సులను కొనసాగిస్తున్నారు. అత్యధికంగా దుబ్బాక-సిద్దిపేట రూట్‌లో 5 ఆర్డీనరీ బస్సుల ద్వారా రోజుకు 35 ట్రిపులు, 6 ఎక్స్‌ప్రెస్ బస్సుల ద్వారా 12 ట్రిపులు కొనసాగుతున్నాయి. దుబ్బాక-సికింద్రాబాద్ (జేబీఎస్) 6 బస్సులు రెండు ట్రిపులు చొప్పున, దుబ్బాక -బీబీపేటకు 4 బస్సులు, దుబ్బాక-ముస్తాబాద్‌కు 2 బస్సులు, మిగిలిన బస్సులను గ్రామాల మీదుగా సిద్దిపేట, సికింద్రాబాద్‌కు నడుపుతున్నారు. గతేడాది డిపో ఆదాయం 6.5 లక్షలు నగదు వచ్చేది. ప్రస్తుతం రూ.8లక్షలు వస్తున్నది. ఇందులో నగదు రూపంలో కేవలం రూ.2లక్షలు, మిగిలినది మహాలక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది.

### తగ్గిన బస్సులతో ఇక్కట్లు

సిద్దిపేట, జనవరి 19: ఆర్టీసీ బస్సులు సమయానికి రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. వచ్చిన బస్సుల్లో ప్రయాణికుల రద్దీ పెరగడంతో ప్రయాణం ఇబ్బందిగా మారింది. సిద్దిపేట డిపో పరిధిలో 102 బస్సులు ఉన్నాయి. సిద్దిపేట డిపో నుంచి జేబీఎస్, హైదరాబాద్, కామారెడ్డి, వేములవాడ, మెదక్, హనుమకొండ రూట్లలో బస్సులు నడుపుతున్నారు. బీదర్ వెళ్లే రూట్లో 13 ఎక్స్‌ప్రెస్ బస్సులు నడుపుతుండగా, 7 బస్సులను సికింద్రాబాద్ జేబీఎస్ వరకు పరిమితం చేసింది. దీంతో జహీరాబాద్, పటాన్‌చెరువు, సంగారెడ్డి, తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొమురవెల్లి మల్లన్న జాతరకు గతేడాది 14 బస్సులు నడపగా, ప్రస్తుతం 10 బస్సులు ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి ఉదయం విద్యార్థుల కోసం 15 బస్సులు నడుపుతుండగా, అందులో 2 బస్సులు నిలిపి వేశారు. చేర్యాల నుంచి ఈసీఐఎల్ రూట్లో వెళ్లే బస్సును రద్దు చేశారు. అనేక బస్సుల్లో మహిళా ప్రయాణికులు గొడవ పడుతున్నారు.

### బాసర బస్ సర్వీస్ బంద్

చేర్యాల, జనవరి 19: బాసర జ్ఞాన సరస్వతీ క్షేత్రానికి దశాబ్దాలుగా నడుస్తున్న బాసర బస్ సర్వీస్‌ను ఆర్టీసీ అధికారులు బంద్ చేసినట్లు ప్రయాణికులు వాపోతున్నారు. ఎన్నో ఏండ్లుగా జనగామ నుంచి చేర్యాల మీదుగా సిద్దిపేట, రామాయంపేట, కామారెడ్డి, నిజామాబాద్ నుంచి బాసరకు నడుస్తున్న బస్ సర్వీస్‌తో చేర్యాల ప్రాంత ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉండేది. మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత బస్ ప్రయాణంతో ఆర్థికంగా నష్టపోతున్న నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు ఆదేశాల మేరకు జనగామ ఆర్టీసీ అధికారుల సదరు బస్ సర్వీస్ నిలిపివేశారు. జనగామ నుంచి బచ్చన్నపేట, చేర్యాల మీదుగా 18 బస్ సర్వీస్‌లు నిత్యం మూడు ట్రిప్పుల చొప్పున సిద్దిపేట టు జనగామకు నడిచేవి. ప్రస్తుతం 30కి పైగా బస్ సర్వీస్ ట్రిప్పులు కొనసాగుతుండడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి.

### సరిపడా బస్సుల్లేవ్...

హుస్నాబాద్, జనవరి 19 : హుస్నాబాద్ డిపో పరిధిలోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, చిగురుమామిడి మండలాలు ఉండగా, ప్రధానంగా కరీంనగర్, హుజూరాబాద్, జనగాం, హైదరాబాద్ రూట్లలో బస్సులు ఎక్కువగా నడిపిస్తున్నారు. డిపోలో మొత్తం 55 బస్సులు 27రూట్లలో నడుస్తున్నాయి. 33 బస్సులు ఆర్టీసీవి కాగా 22 బస్సులు ప్రైవేట్‌వి ఉన్నాయి. డిసెంబర్ 9వ తేదీ కంటే ముందు డిపో పరిధిలోని మొత్తం బస్సులు రోజూ 17వేల మందిని తమ గమ్యాలకు చేర్చేవి. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకం ప్రవేశ పెట్టడంతో ప్రయాణికుల సంఖ్య రెట్టింపు అయ్యింది. జనవరి రెండో వారానికల్లా ఈ సంఖ్య 30వేలకు పైగా ఉండడంతో బస్సు ప్రయాణం ప్రయాసంగా మారింది.

### బస్సుల్లో రద్దీ.. ప్రయాణికుల ఇక్కట్లు

గజ్వేల్, జనవరి 19: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపోలో 66 బస్సులు ఉండగా, అందులో 28వరకు ప్రైవేటు బస్సులున్నాయి. రోజూ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో పరిధిలో 24వేల కిలోమీటర్ల దూరం బస్సులు ఆయా రూట్లలో తిరుగుతున్నాయి. రోజూ సాయంత్రం ప్రజ్ఞాపూర్ బస్టాండ్ వద్ద అధిక సంఖ్యలో ప్రయాణికులు బస్సుల కోసం పడిగాపులు కాస్తున్నారు. బస్సుల్లో ప్రయాణికుల రద్దీ పెరగడంతో మరిన్ని సర్వీస్‌లను పెంచాలని ప్రయాణికులు, ఆర్టీసీ యూనియన్ నాయకులు కోరుతున్నారు.

### బస్ నడపడం సమస్యగా మారింది



రెండు నెలల నుంచి బస్ నడపడం చాలా కష్టంగా మారింది. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచితంగా ప్రయాణం కల్పించడంతో మహిళా ప్రయాణికులు భారీ సంఖ్యలో ప్రయాణిస్తున్నారు. నేను దుబ్బాక-సికింద్రాబాద్ రూట్‌లో బస్ నడుపుతాను. ఆ రూట్‌లో చాలా గ్రామాలుండడంతో ప్రతి చోట బస్ నిలుపాలి. ప్రయాణికులతో ఎంత శాంతంగా మాట్లాడినా ఫలితం ఉండడం లేదు. నేను డ్రైవింగ్ చేసే క్యాబిన్‌లోకి కూడా మహిళలు వచ్చి నిలబడి ప్రయాణిస్తున్నారు. మాకు పని భారం అధికమవడంతో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి.

*-యాదవ్‌రెడ్డి, అద్దె బస్ డ్రైవర్, దుబ్బాక డిపో*

### బస్సులు మరిన్ని పెంచాలి



ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం సంతోషం. ఇందుకు సరిపడా బస్సులు నడపడం లేదు. ఉన్న బస్సుల్లో అందరూ ఒక్కసారి ప్రయాణించాలంటే ఇబ్బందిగా మారింది. ఇంతకుముందు దుబ్బాక నుంచి సిద్దిపేటకు అరగంటకు ఒకటి చొప్పున బస్ ఉండేది. ఇప్పుడు గంటకొకటి నడిపిస్తున్నారు. దీంతో గ్రామాలకు సమయానికి వెళ్లలేక పోతున్నాం.

*- భారతి, ప్రయాణికురాలు, చీకోడు(దుబ్బాక)*

### సమయానికి బస్సులు నడపాలి



గ్రామాల్లో విద్యార్థుల కోసం మాత్రమే బస్సులు నడుపుతున్నారు. ఆ తర్వాత గ్రామాల్లోకి బస్సులు వస్తలేవు. రోజు బస్సులో ప్రయాణం చేసేటోళ్లకు మాత్రమే ఉపయోగకరంగా ఉంది. కానీ ఊర్లో ఉన్న మాలాంటి వారు బస్సులు రోజు ఎందుకు ఎక్కుతారు. అందుకే బస్సులను ఊర్లలోకి నడుపాలి. చిన్నకోడూరు పోదామని వచ్చిన కానీ బస్సులు లేవు. ఇక్కడున్న సార్‌ను అడిగితే పొద్దునే ఉంటుందని చెప్పారు. బస్సుల నడిపే టైమ్ కింద మీద చేసినారు. సమయానికి బస్సులు నడుపాలి.


*-దుర్గయ్య, ప్రయాణికుడు*

### ప్రతిపాదనలు పంపాం



ప్రయాణికుల సంఖ్యను బట్టి బస్సులను నడుపుతున్నాం. పండుగలు, వారంలో రెండు నుంచి మూడు రోజుల పాటు ప్రయాణికు రద్దీ అధికంగా ఉన్నప్పుడు కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. డిపోకు ఇప్పటికే మూడు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సులు వచ్చాయి. మరో 12బస్సులు కావాలని ఆర్టీసీ యాజమాన్యానికి ప్రతిపాదనలు పంపాం. కొత్త బస్సులు వస్తే డిపో పరిధిలో ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమతమ గమ్యస్థానాలకు చేరవేస్తాం.

*- వెంకటేశ్వర్లు, హుస్నాబాద్ డిపో మేనేజర్*



ఫరూఖ్ హుస్సేన్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

## ఫరూఖ్ హుస్సేన్‌కు ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి పరామర్శ

దుబ్బాక, జనవరి 19: అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్న మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్‌ను శుక్రవారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

## నవోదయ పరీక్షకు సర్వం సిద్ధం

మిరుదొడ్డి, జనవరి 19: మిరుదొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 19న నిర్వహించనున్న నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో జోగు ప్రభుదాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 195 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్ష సెంటర్ వద్దకు ఉదయం 10:15 గంటల వరకు చేరుకోవాలని సూచించారు.

## విరిగిన విద్యుత్ స్తంభం తొలిగింపు



విరిగిన స్తంభాన్ని తొలిగిస్తున్న సిబ్బంది

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

మద్దూరు (ధూళిమిట్ట), జనవరి 19: మద్దూరు మండలంలోని రేబర్తి, లక్కపల్లి గ్రామాల మధ్య ఓ రైతు పొలంలో ఓ విద్యుత్ స్తంభం విరిగిపోయి ప్రమాదకరంగా ఉండడంతో 'నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం' అనే శీర్షికతో గురువారం ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. చేర్యాల ఏడీఈ రత్నాచారి, ఏఈ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు శుక్రవారం విద్యుత్ అధికారులు విరిగిపోయిన స్తంభాన్ని తొలిగించి, వైర్లను సరిచేశారు. విరిగిన విద్యుత్ స్తంభాన్ని తొలిగించడంతో పలువురు రైతులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. విరిగిన స్తంభాన్ని తొలగించేందుకు కృషి చేసిన 'నమస్తే తెలంగాణ'కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

## 'మల్లన్న' భక్తుల వసతుల కల్పనకు కృషి

చేర్యాల, జనవరి 19: కొమురవెల్లి మల్లన్న భక్తులకు వసతులు కల్పించేందుకు ఆలయ పునరుద్ధరణ కమిటీ కృషి చేస్తున్నదని చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి తెలిపారు. మల్లన్న ఆలయ నిధులు రూ.కోటీ 30లక్షలతో అన్నప్రసాద వితరణశాలకు ఎదురుగా నిర్మించిన 16 కాటేజీలు (శివ సదనం)ను చైర్మన్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ పునరుద్ధరణ కమిటీ సభ్యులు శ్రీనివాస్, శ్రీనివాస్, నర్సింహులు, దామోదర్, ప్రవీణ్‌యాదవ్, రమేశ్, సాయియాదవ్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంజూరు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను చైర్మన్ ప్రారంభించారు. భక్తుల కోసం దాత నిర్మించిన లిఫ్ట్‌ను ప్రారంభించారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

హుస్నాబాద్ టౌన్, జనవరి 19: యువజన క్రీడోత్సవాలను పురస్కరించుకుని ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పట్టణంలోని ఆయా పాఠశాలకు చెందిన 9, 10వ తరగతికి చెందిన విద్యార్థులతో పాటు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. స్వామివివేకానంద, సుభాస్‌చంద్రబోస్ జయంతిలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న యువజన క్రీడోత్సవాల్లో భాగంగా నలందా యూనివర్సిటీ చరిత్రపై విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సావుల ఆదిత్య హాజరయ్యారు. యువతలో దేశభక్తిని పెంపొందించడమే తమ లక్ష్యమన్నారు. ఏబీవీపీ నగర కార్యదర్శి రాకేశ్, రాజేశ్, చరణ్, రాహుల్, అరవింద్ పాల్గొన్నారు.

## కూలీల పని హక్కులు కాపాడండి

గజ్వేల్, జనవరి 19: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి కేంద్రం బడ్జెట్‌లో నిధులు తగ్గించడం, నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం, ఆధార్ బేస్డ్ వేతనాలు చెల్లింపు పద్ధతులను ప్రవేశపెట్టి కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ చట్టాన్ని ఉల్లంఘిస్తూ పని హక్కులను కాలరాస్తున్నదని దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి శంకర్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ప్రజాభవన్‌లో జరిగిన ప్రజావాణిలో ఉపాధిహామీ పథకంపై వినతి పత్రం అందజేశారు.

## పంచాయతీ రికార్డులు స్వాధీనం

నారాయణరావుపేట, జనవరి 19: మండలంలోని ఇబ్రహీంపూర్ పంచాయతీ రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్ తెలిపారు. పంచాయతీలో అవినీతి, అక్రమాలు జరిగాయని, కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సంస్థ ప్రతినిధులు జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారని.. డీపీవో ఆదేశాల మేరకు విచారణ చేపట్టి రికార్డులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీనిపై విచారణ పూర్తి చేసి త్వరలో ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవయ్య, ఉప సర్పంచ్ దేవయ్య, పంచాయతీ కార్యదర్శి అర్షద్, కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జయదేవ్**

కొండపాక, జనవరి 19: బ్యాంకు లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జయదేవ్ కోరారు. శుక్రవారం మండలంలోని మర్పడగలో సెర్ప్ ద్వారా ఏర్పాటు చేసిన యూనిట్లను మహిళా సంఘాల సభ్యులతో కలిసి సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ పీడీ రవీందర్, డీపీఎం విద్యాసాగర్, ఏపీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన

నారాయణరావుపేట, జనవరి 19: మండలంలోని మాటిండ్ల ఆర్‌డీఎఫ్ హైస్కూల్ విద్యార్థులకు యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ నిర్మూలన గురించి చిన్నకోడూరు ఎస్సై సుభాశ్‌గౌడ్ శుక్రవారం అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ.. మహిళలు, యువతులు ఎలాంటి సమస్య ఉన్నా, నిర్భయంగా షీటీమ్ నెంబర్ 8712667434కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 'మల్లన్న'ను దర్శించుకున్న సీపీ

చేర్యాల, జనవరి 19 : కొమురవెల్లి మల్లికార్జున స్వామిని సిద్దిపేట సీపీ అనురాధ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. సీపీని ఆలయ సంప్రదాయం మేరకు ఈవో బాలాజీ, చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆమె వెంట ఆలయ ఏఈవో గంగా శ్రీనివాస్, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, కమిటీ సభ్యులు, సిబ్బంది ఉన్నారు.

## రిపబ్లిక్ డే పరేడ్‌కు గిరిజన యువతి



ఇస్లావత్ స్వప్న

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 19: ఈనెల 26న దేశ రాజధాని ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు ధూళిమిట్ట మండలంలోని హనుమతండా పంచాయతీ పరిధిలోని పంతులు తండాకు చెందిన ఇస్లావత్ గోపి-సునీత దంపతుల కూతురు స్వప్న ఎంపికైనట్లు గ్రామస్తులు తెలిపారు. ఐటీబీపీ పోలీస్ ఫోర్స్ నుంచి స్వప్న పరేడ్‌కు ఎంపికైంది. స్వప్న 2021 ట్రైనింగ్ పూర్తి చేసుకొని నేపాల్ సరిహద్దులో సైనికురాలిగా విధులు నిర్వర్తిస్తుంది.

## కెనాల్స్ నిర్మాణానికి నిధులు కేటాయించండి: చాడ

హుస్నాబాద్, జనవరి 19 : హుస్నాబాద్ నియోజకవర్గ వరప్రదాయిని గౌరవెల్లి రిజర్వాయర్ కెనాల్స్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి మంత్రి ఉత్తమ్‌ను కోరారు. హైదరాబాద్‌లోని మంత్రి చాంబర్‌లో శుక్రవారం కలిసిన చాడ గౌరవెల్లి రిజర్వాయర్ ప్రాధాన్యత, పూర్తి చేసేందుకు కావాల్సిన నిధుల గురించి వివరిస్తూ వినతి పత్రం అందజేశారు.

## ఎస్ఎంసీ కమిటీల ఎన్నికకు ఉత్తర్వులు జారీ: డీఈవో

సిద్దిపేట అర్బన్, జనవరి 19 : జిల్లాలోని అన్ని జడ్పీ ఉన్నత పాఠశాలు, ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ, మోడల్, రెసిడెన్షియల్, ఎయిడెడ్ పాఠశాలల్లో మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఈవో శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈనెల 20న నోటిఫికేషన్ జారీ చేయడంతో పాటు ఈ నెల 29న ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఒకటి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు పోటీ చేసే అవకాశం కల్పించినట్లు డీఈవో తెలిపారు.



శిక్షణ పొందిన కానిస్టేబుళ్లతో మాట్లాడుతున్న సీపీ అనురాధ

## విచారణ పారదర్శకంగా చేయాలి

- రౌడీలు, కేడీలపై నిరంతరం నిఘా పెట్టాలి: సీపీ

సిద్దిపేట అర్బన్, జనవరి 19: పూర్తి పారదర్శకంగా ప్రతి కేసును ఇన్వెస్టిగేషన్ చేయాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ సూచించారు. శుక్రవారం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో పోలీస్ అధికారులతో పెండింగ్ కేసులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసుల గురించి ఏసీపీ, సీఐ, ఎస్సైలను అడిగి తెలుసుకున్నారు. సీపీ మాట్లాడుతూ.. గంజాయి, మత్తు పదార్థాలు, పేకాట, జూదం వంటి వాటిని ఉక్కుపాదంతో అణచివేయాలన్నారు. మహిళలకు రక్షణకు పెద్దపీట వేయాలన్నారు. రౌడీలు, కేడీలు, సస్పెక్ట్‌ల కదలికలపై నిరంతరం నిఘా పెట్టాలన్నారు. దొంగతనాల కేసుల్లో ప్లాన్ ఆఫ్ యాక్షన్, ఎస్ఓపీ ప్రకారం ఇన్వెస్టిగేషన్ చేసి కేసులను ఛేదించాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాసరావు, సిద్దిపేట ఏసీపీలు సతీశ్, రమేశ్, సురేందర్‌రెడ్డి, ప్రసన్నకుమార్, చంద్రశేఖర్, రవీందర్‌రాజు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి

సైబర్ నేరాలు జరగకుండా రోజూ ప్రజలకు అవగాహన కల్పించాలని, జాగ్రత్తల గురించి సోషల్ మీడియాలో పోస్టులు చేయాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ తెలిపారు. శుక్రవారం ప్రతి పోలీస్ స్టేషన్ నుంచి ఎంపిక చేసిన కానిస్టేబుళ్లను సైబర్ వారియర్స్‌గా నియమించి సైబర్ నేరాల నివారణ గురించి కమిషనరేట్‌లో ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సైబర్ వారియర్స్‌కు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ శేఖర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.

## సమన్వయంతో పనిచేయాలి

- దుబ్బాక ఆర్వో, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్



మాట్లాడుతున్న గరిమా అగర్వాల్

సిద్దిపేట అర్బన్, జనవరి 19: రాబోయే పార్లమెంట్ ఎన్నికల కోసం అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని దుబ్బాక ఆర్వో, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం మెదక్ పార్లమెంట్ పరిధిలోని దుబ్బాక నియోజకవర్గ సెక్టార్, పోలీస్ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దుబ్బాక నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేసినందుకు అభినందించారు. అదే ఉత్సాహంతో పార్లమెంట్ ఎన్నికలను సైతం విజయవంతం చేయాలన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్లను సందర్శించి.. విద్యుత్, ర్యాంపు, మరుగుదొడ్లు, ప్రహరీ, గేటు ఉండేలా చూసుకోవాలన్నారు. ఎన్నికల స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ మాత్రమే లచ్చపేట తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఉంటుందన్నారు. 18 ఏండ్లు నిండిన వారు ఓటరు కార్డు నమోదు చేసుకునేందుకు డిగ్రీ కళాశాలలో ప్రత్యేక క్యాంపులు పెట్టాలన్నారు. సమావేశంలో పలువురు సెక్టార్ అధికారులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

### సర్పంచ్‌ల పదవీకాలం పొడిగించాలని కలెక్టర్‌కు వినతి

సిద్దిపేట అర్బన్, జనవరి 19 : పంచాయితీలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించి సర్పంచుల పదవీకాలం మరో ఏడాది పాటు పొడిగించాలని సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్ మండలాల గ్రామాల సర్పంచులు శుక్రవారం కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో గ్రామాల సర్పంచులు ఉన్నారు.

## ఓటరు నమోదుకు స్పెషల్ క్యాంపెయిన్ డే



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులు

సిద్దిపేట అర్బన్, జనవరి 19: 20, 21 తేదీల్లో నిర్వహించే ఓటరు నమోదు స్పెషల్ క్యాంపెయిన్ డే ను విజయవంతం చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. శుక్రవారం సెకండ్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ వికాస్ రాజ్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు ఓటరు జాబితా సవరణ, కొత్త ఓటింగ్ నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి, కార్డులను ముద్రించి పంపిణీ చేయాలన్నారు. వీడియా కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ మాట్లాడుతూ.. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్‌వోలు అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్, ఆర్‌డీవోలు, ఎన్నికల సూపరింటెండెంట్ రామేశ్వర్ పాల్గొన్నారు.

### వాస్తవికతకు అనుగుణంగా బడ్జెట్ తయారు చేయాలి: కలెక్టర్

సిద్దిపేట అర్బన్, జనవరి 19: మున్సిపాలిటీల బడ్జెట్‌ను వాస్తవికతకు అనుగుణంగా తయారు చేయాలని సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సిద్దిపేట కలెక్టరేట్‌లో శుక్రవారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) గరిమాఅగర్వాల్‌తో కలిసి జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల మున్సిపాలిటీ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరం జిల్లాలోని మున్సిపాలిటీల బడ్జెట్‌ను మరోసారి పరిశీలించాలన్నారు. మున్సిపల్ చైర్మన్లు, వార్డు కౌన్సిలర్లను సంప్రదించి 2024-25కు పట్టణ సమగ్రాభివృద్ధి, పారిశుధ్యం, పచ్చదనానికి ప్రాధాన్యత ఇస్తూ బడ్జెట్ తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీల కమిషనర్లు పాల్గొన్నారు.

## వీగిపోయిన మున్సిపల్ అవిశ్వాసం

- కోరం లేకపోవడంతో అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రిసైడింగ్ అధికారి ప్రకటన
- అవిశ్వాస సమావేశానికి ఏడుగురు కౌన్సిలర్లు హాజరు
- పట్టు నిలుపుకొన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రిసైడింగ్ అధికారి రమేశ్‌బాబు

చేర్యాల, జనవరి 19 : చేర్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డిపై కౌన్సిలర్లు ప్రకటించిన అవిశ్వాసం వీగిపోయిందని ప్రిసైడింగ్ అధికారి, సిద్దిపేట ఆర్డీవో రమేశ్‌బాబు ప్రకటించారు. 12మంది కౌన్సిలర్లతో పాటు మరో ఎక్స్‌ఆఫీషియో సభ్యుడితో కలిసి 13మంది సభ్యులకు గాను అవిశ్వాసం నెగ్గేందుకు తొమ్మిది మంది సభ్యులు హాజరుకావాల్సి ఉండగా, ఏడుగురు సభ్యులే హాజరయ్యారు. దీంతో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై తొమ్మిది కౌన్సిలర్లు ప్రకటించిన అవిశ్వాసం వీగిపోయింది. జనగామ, చేర్యాల మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్‌కు చెందిన చైర్మన్లు, వైస్ చైర్మన్లు కొనసాగుతున్నారు. ఇటీవల మారిన రాజకీయ పరిస్థితులతో రెండు మున్సిపాలిటీల్లో కాంగ్రెస్‌కు చెందిన కౌన్సిలర్లు కొందరు బీఆర్ఎస్ కౌన్సిలర్లతో చేతులు కలిపి అవిశ్వాసాలకు తెరలేపారు. దీంతో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బీఆర్ఎస్ కౌన్సిలర్లతో చర్చలు జరిపి రెండు మున్సిపాలిటీలపై గులాబీ జెండా రెపరెపలాడించడంతో శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

### ఏడుగురు సభ్యులు హాజరు

మున్సిపల్ కార్యాలయంలో సిద్దిపేట ఆర్డీవో, ప్రిసైడింగ్ అధికారి రమేశ్‌బాబు మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్‌తో కలిసి అవిశ్వాస సమావేశం నిర్వహించారు. మొదట ఉదయం 10:30 నుంచి 11 వరకు అవిశ్వాస ప్రక్రియ ప్రారంభం కావడంతో కాంగ్రెస్‌కు చెందిన కౌన్సిలర్లు ఉడుముల ఇన్నమ్మ, ముస్త్యాల తార, సందుల సురేశ్, తుమ్మలపల్లి లీల, చెవిటి లింగం, బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆడెపు నరేందర్, జుబేదాఖతూన్ హాజరయ్యారు. తొమ్మిది సభ్యులు రాకపోవడంతో ప్రిసైడింగ్ అధికారి ఒంటిగంటలకు మరోసారి సమావేశం నిర్వహించి అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రకటించారు. అనంతరం పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ తమకు అవిశ్వాసం పెట్టాలనే యోచన లేదని, ఇద్దరు కౌన్సిలర్లు అవిశ్వాస ప్రక్రియకు తెర లేపి వారే టూర్‌కు వెళ్లిపోయారని వాపోయారు.

## నాటుసారా స్వాధీనం.. బైక్ సీజ్

అక్కన్నపేట, జనవరి 19 : హుస్నాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని అక్కన్నపేట మండలం గౌరవెల్లి సమీపంలో గురువారం రాత్రి 10 లీటర్ల నిషేధిత నాటుసారాను బైక్‌పై తరలిస్తున్న ఓ వ్యక్తిని పట్టుకొని స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ ఎస్సై దామోదర్ తెలిపారు. వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా, మండలంలోని గండిపల్లి పంచాయతీ పరిధిలోని మంజ్యతండాకు చెందిన ముడావత్ తిరుపతి తన ద్విచక్రవాహనంపై 10లీటర్ల నాటుసారాను రవాణా చేస్తున్నట్లు గుర్తించి పట్టుకున్నామన్నారు. నిషేధిత నాటుసారా తయారీ, రవాణా చేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరమని, అతడిపై కేసు నమోదు చేశామన్నారు. నాటుసారాను స్వాధీనం చేసుకొని, బైక్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించామన్నారు. తనిఖీల్లో కానిస్టేబుళ్లు రాజు, సతీశ్ ఉన్నారు.